కథానిక

# ప్రాణప్రదాతలు

—సత్యనారాయణరావు

రాత్రి ఎనిమిదిగంటలవేళ పెను ప్రళయం లాంటి తుపానులో ఉక్కిరిబిక్కిరి అయిన వాతావరణం అప్పుడే కొంచెం ఊపిరి తీసుకో గలుగుతూన్నది. కాని చినుకుమాత్రం యింకా ఒత్తుగానే పడుతూంది. నాటికి సరిగ్గా నాలుగు రోజుల క్రితం నరకసమానమైన గృహాన్ని విపరీతమైన పరిస్థితిలో విడిచిపెట్టిన కామేశ్వరి నిశ్శబ్ద దరిద్ర ప్రపంచంలో ప్రవేశించి గమ్యస్థానంలేని పయనం సాగించింది.

నాలుగురోజుల కఠిన ఉపవాసాలలో కృశించి, వర్షంలో తడిసి ముద్దయి, ఇంక ఒక్క అడుగైనా వెయ్యలేని దీనావస్థలో ఆ నిర్భాగ్యురాలు చేసేదేం లేక ఒకయింటి అరుగుపై చలికి వణించిపోతూ కూర్చుంది. పదిహేను నిమిషాలు గడిచాయి. లోపలి గడియారం 'టంగు'మని ఒకగంట కొట్టింది. ఇంటిముందు ఒకకారు ఆగింది. కార్లోంచి దిగిన డాక్టరుగారు మెట్లెక్కుతూ అరుగుమీద కూర్చున్న వ్యక్తిని క్రీనీడలో చూసి టార్చివేశారు. ప్రపంచంలోని జాలి నంతటినీ తనవేపు ప్రోగుచేసుకుంటూన్న ఆ నిర్భాగ్యురాలు కళ్ళు మిరుమిట్లుపోయే టార్చిలైటు కాంతిలో ఒక్కసారి డాక్టరుగారిని చూసి ముఖం దించుకుంది.

వెలుగులెరుగని జీవితానుభవాలను ఆవిడ లోచనగోళాలలో చూసిన డాక్టరుగారు ఒక్క క్షణకాలం తల దించుకున్నారు. మళ్ళీ తల పైకెత్తి కామేశ్వరిని చూస్తూ—

“ఎవరమ్మా నీవు?” అన్నారు. దించిన తల చంద్రగమనంలా పైకెత్తిన కామేశ్వరిని చూస్తూ, రెండడుగులు ముందుకువేసి,

“ఎవరమ్మా నీవు?” అని మళ్ళీ అన్నారు డాక్టరుగారు. ఒక్కసారి తలదించి మళ్ళీ పైకెత్తేలోగా ఆవిడ నేత్రాలనుండి రెండు బాష్పబిందువులు నేలజారేయి. పొంగి వస్తూన్న దుఃఖాన్ని హృదయంలోనే మటిపెట్టి ఆవిడ—

“ఏమని చెప్పేది బాబూ-ప్రపంచానికే బరువైపోయిన ఒక నిర్భాగ్యను” అంటూ లేవడానికి ప్రయత్నించింది. కాని అందుకూడా శక్తి లేక మళ్ళీ అలాగే కూర్చుండిపోయింది. కొంచెం స్పృహ తప్పినట్టయింది నిస్సత్తువ నుంచి. డాక్టరుగారు గుమ్మం దగ్గరకువచ్చి “మణీ!” అని పిలిచారు. లోపలినుంచి చెంగున గెంతుతూ మణి వచ్చింది.

* * *

డాక్టరుగారింట్లో ఒక గదిలో పడుకున్న కామేశ్వరి కళ్ళుతెరిచింది. ప్రక్కనే కూర్చున్న మణి “కాఫీ తీసుకోండి” అంటూ ఫ్లాస్కులోని వేడివేడి కాఫీ కప్పులో పోసి కామేశ్వరికి అందించింది. కాఫీ రుచిమర్చిపోయి సుమారు నాలుగు సంవత్సరాలయిందేమో ఆవిడ “నా కలవాటు లేదమ్మా” అంది. “పోనీలెండి పాలు తాగండి” అంటూ పాలు ఒక కప్పులో పోసి కామేశ్వరి కందించింది. మణి నవ్వు ముఖం చూస్తూ వేడివేడి పాలు త్రాగింది కామేశ్వరి. లోకం అంటే ఏమిటో తెలుసుకొని, గృహిణీ జీవితం ప్రారంభించిన తరువాత, మానవత్వం, ప్రేమ, అభిమానం అంటే ఏమిటో టార్చిలైటు వెల్తురులో చూచిన డాక్టరుగారిముఖంలోనూ, కప్పుతో పాలు అందిస్తున్నమణి అమాయికమైన నవ్వులోనూ కామేశ్వరి మొదటిసారి చూసి, ఒక నూతన చైతన్యాన్ని అనుభవించింది.

లేచి కూర్చొని గులాబులవంటి మణి చెక్కిళ్ళు తన చేతులో పుచ్చుకొని, తన అభిప్రాయాన్ని వెలిబుచ్చలేక రెండు గుటకలు మింగింది, విస్మృతి ప్రపంచంలో దేనికోసమో వెతుక్కున్నట్టు. ఒక్కసారి మణి ముఖంలోకి

శూన్యంగా చూసి మళ్ళీ ఒక గుటక మ్రింగింది. అప్రయత్నంగా స్రవించే బాష్ప బిందువులు చెక్కిళ్ళపైనుండి జారుతూంటే ఆవిడ మళ్ళీ మణి చెక్కిలి చేతపుచ్చుకొని "చెల్లీ! నువ్వు ఎంత మంచిదానవమ్మా!" అంది. ఇక మరేమీ అనలేకపోయింది.

*　　　*　　　*

డాక్టరుగారింట్లో పునర్జీవనం ప్రారంభించిన కామేశ్వరి డాక్టరుగారు పనిచేస్తున్న జనరల్ హాస్పిటల్‌లో నర్సుగా ప్రవేశించి జీవితం గడుపుతూంది.

మణిమాత్రం అప్పుడప్పుడూ మహా అయిన ప్రశ్నలు కామేశ్వరిని అడుగుతూండేది. ఆ ప్రశ్నలకు ఆవిడ ఏదో తృప్తికరమైన సమాధానాలే చెబుతూ వచ్చేది.

సాయంత్రం ఆరయింది. హాస్పటల్‌నుంచి వచ్చి స్నానం చేసి, మామూలు దుస్తులు కట్టుకొని గబగబ డాక్టరుగారింటి మెట్లెక్కుతూ "మణీ" అని పిలిచింది కామేశ్వరి. డ్రాయింగురూములో పేపరు చదువుకుంటూన్న డాక్టరుగారు "ఇవాళ వాళ్ల స్కూల్ వార్షికోత్సవం. అంచేత అక్కడకు వెళ్ళిందమ్మా. యీలా వచ్చి కూర్చో, ఇప్పుడే వచ్చేస్తుంది" అని అన్నారు. డాక్టరుగారి బలవంతంమీద ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది కామేశ్వరి. పేపరు పక్క టేబుల్ మీద ఉంచి, కళ్ళజోడుతీసి కళ్లు తుడుచుకుంటూ కొంచెంసేపు నిశ్శబ్దం వహించేరు డాక్టరుగారు. రెండేండ్ల క్రితం తన కుటుంబంతో ఒక చెప్పలేని బాంధవ్యం ఏర్పరచుకున్న కామేశ్వరితో డాక్టరుగారు ఆరోజువరకూ ఏదో యోగక్షేమ ప్రసంశ తప్పిస్తే ఇంకో విషయం ఏదీ మాటాడలేదు. ఆయనది జాలి గుండె. ఏ ప్రసంశవల్ల ఆవిడ హృదయానికి నొప్పి కలుగుతుందో అని ఆయన అనుమానం. రెండు నిముషాలు అలా మౌనముద్రలో యిద్దరూ ఉండిపోయారు. ఏ ప్రశ్న వెయ్యడం అని డాక్టరుగారు, ఏ ప్రశ్నకు సమాధానం చెప్పవలసి వస్తుందో అని కామేశ్వరి అవ్యక్త భావ ప్రపంచంలో మునిగిపోయేరు. గడియారం పెండ్యులంలా యిద్దరి హృదయాలూ ఊగి ఒక్కసారి కొట్టుకున్నాయి. ఆవిడ పూర్వ కథ తెలుసుకోవడం తన విధి అని తోచి డాక్టరుగారు గంభీరంగా అన్నారు:

"కామేశ్వరీ! ఏమిటమ్మా కారణం నీవీ అవస్థను రావడానికి?"

చలిపిడుగువంటి డాక్టరుగారి ప్రశ్నకు క్షణకాలం ఉక్కిరిబిక్కిరి అయిపోయింది కామేశ్వరి. వడగాడ్పులవంటి నాలుగు నిట్టూర్పులతో మళ్ళీ చేతన ప్రపంచంలో ప్రవేశించి ఒక్కసారి డాక్టరుగారివేపు శూన్యంగా చూసింది. కామేశ్వరి హృదయంలోని బాధను ఆవిడ చూపిన అవ్యక్త భావంలో డాక్టరుగారు స్పష్టంగా చూశారు. 'అయ్యో! ఎంతపని చేశాను' అనిఆయన తనలోతను అనుకున్నారు. కాని వేసిన ప్రశ్నతో ఆయనపని పూర్తి అయింది. ఇంక సమాధానం ఇవ్వడం ఆవిడ వంతు.

డాక్టరుగారు వేసినది చిన్న ప్రశ్నే అయినా అది తన హృదయాన్ని మంథరగిరితో మథించినట్టయింది. ఇంక హాలాహలంవంటి తనకన్నీటి కథను ఆయన ప్రశ్నకు సమాధానంగా చెప్పాలి. మళ్ళీ ఒక వేడి నిట్టూర్పు విడిచి, కామేశ్వరి అన్నది :

"డాక్టరుగారూ! అంతు తెలియని అభిమాన పూర్వకమైన మీ ప్రశ్నకు ఏమి సమాధానం చెప్పాలో తెలియడం లేదండీ. మర్చిపోతూన్న మహా భీకరానుభవాలు తిరిగి ఒక్కసారి నా హృదయాన్ని ఊపిరిసలపని వేగంతో ఊపేయి. ఈ అనుభూతి అట్టేకాలం భరించలేను. ఎంత ప్రయత్నించినా మీ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ధైర్యం చాలకుండా ఉన్నదండి. కాని నాకు పునర్జీవనం ప్రసాదించి, మీ కన్న బిడ్డవలె నన్ను ఆదరించిన మీకు నేను స్వయంగా సమాధానం చెప్పలేను. ఉండండి ఇప్పుడేవస్తాను." అనిదగ్గరేవున్న తన ఇంటికిపోయి ఏదో ఒక కాగితంతో తిరిగి వచ్చింది.

పిడుగువంటి తన తండ్రిగారి ఆకస్మిక మరణవార్త రహస్యంగా తన స్నేహితురాలివల్ల తెలుసుకున్న కామేశ్వరి, ఆ వార్త తెలిసిన నాటికి ఒకరోజు పూర్వం తన తండ్రికి వ్రాసి

తనవద్దే ఉంచుకున్న లేఖను ఆవిడ అందించగా డాక్టగారు చదవ నారంభించారు.

"ప్రియమైన నాన్నగారికి, మీ అమ్మాయి కామేశ్వరి అనేక నమస్కారములు. మీరు రాజేశ్వరిద్వారా పంపిన జాబు చేరింది. కన్న బిడ్డకి కాస్త కాకచేస్తే కంగారుపడే తండ్రికి, లోకం కనీ వినీ ఎరుగని కష్టాలకు తన బిడ్డ గురియైందంటే ఎలా ఉంటుందో, అందులో ఎంత బాధ ఉందో సాధారణంగా అందరకూ తెలిసినదే. కాని కష్టంగాని, సుఖంగాని ఒకరు తెచ్చిపెట్టినది కాదు. తల్లి ఎటువంటిదో ఎరుగని నన్ను మీరెలా పెంచి పెద్దదాన్ని చేశారో దైవానికి తెలుసు. నన్ను గురించి మీరు గంపెడాశ పెట్టుకున్నారు. సంసార జీవితంలో నేను ఎంతో సుఖపడాలని తల్చుకుని మీరు చాలా ఆశపడ్డారు. కాని దైవం ప్రతికూలిస్తే మానవులేం చెయ్యగలరు చెప్పండి!

నా అవస్థ ప్రత్యక్షంగా చూస్తే మీరు ఎంత బాధపడిపోతారో చెప్పలేను. బ్రతకాలని ఆశ పూర్తిగా పోయింది. జీవితం అంటే అంత ఏవగింపు కలిగింది. నా అవస్థ ప్రపంచంలో ఎవ్వరూ అనుభవించరని అనుకుంటాను. పగవాళ్ళకైనా అటువంటి అనుభవం వద్దు. సాధారణమైన యిబ్బందులు, బాధలు, కష్టాలు సామాన్య గృహ జీవితంలో కద్దు. కాని నాది ఒక నరకం, రాక్షస లోకంకంటె లేని కష్టం అయినది. రాక్షసులకు కూడా ఒకానొకప్పుడైనా ప్రాణం చివుక్కుమని జాలికలుగవచ్చు. కాని మా పిన్నత్తగారు అంతకంటె హీనం. ఆవిడకు హృదయం లేదు. అందుకేమీ చెయ్యలేం. కాని కట్టుకున్న ఆయనకైనా ... పొద్దుట లేచినది లగాయతు శరీరం దెబ్బలతో కాయలు కాసిపోతూంది. అపనిందలతో, తిట్లతో హృదయం కూట్లుపడిపోతూంటే జీవించి ఏం ప్రయోజనం నా న్న గా రూ! రెండు రోజుల క్రితం ఉదయాన నా కర్మకు నాలో నేను ఏడుస్తూ పెరటి చావిట్లో కూర్చొని ఉండగా ఆ పాపాత్మురాలి దుష్ప్రచారంవల్ల వెనకపాటునే వచ్చి వెన్నులో ఒక్క తాపుతన్ని ... రాయడానికి చెయ్యి రాదు ఆ దుర్భాషలు. ఆడబ్రతుకు అంత హీనం. యింక జీవించి ఏం ప్రయోజనం నాన్నగారూ? మీ మనస్సు కలత బెట్టుకోకండి. రాయక విధిలేక రాసేను. బ్రతికివుంటే ఎప్పటికైనా మిమ్మల్ని చూస్తాను.

మీ ప్రియ పుత్రిక
కామేశ్వరి.

చివరి పంక్తుల మీద దృష్టి పరిగెడుతూన్నప్పుడు అప్రయత్నంగా డాక్టరుగారి కళ్ల వెంబడి జారిన ఆ రెండు బాష్పకణాలను కామేశ్వరి గుర్తించకపోలేదు. నా ప్రశ్నకు ఇదా సమాధానం అన్నట్టుగా డాక్టరుగారూ— "ఔను" అన్నట్టుగా కామేశ్వరి ఒక్కసారి ఒకరివేపు ఒకరు చూసుకున్నారు.

గడియారం ఎనిమిది కొట్టింది. పరిగెత్తుతూ మణి సరాసరి డ్రాయింగ్ రూములోకే వచ్చి, అజంతా విగ్రహాలవలె అపూర్వ భావప్రకటనతో చైతన్యంలేకుండా కూర్చున్న తండ్రినీ, కామేశ్వరినీ చూసి—

"ఏమి టాలోచిస్తున్నారు నాన్నగారూ? అక్క ఏమలా ఉంది?" అని అడిగింది.

"ఏమీ లేదమ్మా! పాపం-కామేశ్వరి చాలా కష్టాలుపడ్డది" అన్నారు డాక్టరుగారు.

"పోనీ లెండి-ఇప్పుడు కాస్త సుఖంగా ఉంది. కదూ-జరిగిపోయిన వెందుకు తలుచుకోడం? మరింత బాధ." అంటూ మణి కామేశ్వరి దగ్గిరకిపోయి ఆవిడ చెక్కిలి తన కుడి చేత్తోను, తల ఎడంచేత్తోను పట్టుకొని దించి ఉన్న తల పైకెత్తింది. కామేశ్వరి కళ్ళంట బొటబొట నీరు కారుతూంది. వెంటనే తన రుమాలుతో ఆవిడ కళ్ళుతుడిచి, అక్కా లే. భోజనంచేసి సినిమాకు వెళదాం. నాన్నగారూ! మీరూ వస్తారా?" అనేలోగా ఆయన ఒక చిన్న నవ్వునవ్వి "అలాగే నమ్మా" అన్నారు.

* * *

ఆవేళ ఆదివారం. హాస్పటిల్ చాలా రష్‌గా ఉంది. డాక్టరుగారు, కామేశ్వరి ఊపిరి సలపనంత పనిలో ఉన్నారు. సాయంత్రం నాలుగైంది. యాంబులెన్సుకారు జోరుగా వచ్చి ఆగింది. బస్సు ప్రమాదంవల్ల కఠినమైన దెబ్బలు తిని స్పృహతప్పిన ఒక మనిషిని ఆ కార్లోంచి దించి హాస్పిటిల్‌లో ప్రవేశపెట్టేరు.

అప్పుడే ఒక పెద్దఆపరేషన్ ముగించివచ్చిన డాక్టరుగారు యివతలకు వచ్చి ఆ క్షతగాత్రుణ్ణి పరీక్ష చేసేరు. డాక్టరుగారి వెనకనుంచే కామేశ్వరికూడా వచ్చి ఆయన పక్క నిలబడి పేషెంటును చూసింది. తలమీద తీవ్రమైన గాయాలు తగిలేయి. కుడిచెయ్యి ఫ్రాక్చర్ అయిపోయింది. ఇంకా శరీరంమీద అక్కడక్కడ దెబ్బలున్నాయి. స్పృహతప్పి ఉన్నాడు ఆ మందభాగ్యుడు. పేషెంటుగురించి వివరాలేమీ తెలియ లేదని చెప్పేడు రైటరు డాక్టరుతో.

ఆపరేషన్ థియేటరులోకి తీసుకుపోయేరు ఆ పేషెంటును. డాక్టరుగారు, యిద్దరు అసిస్టెంట్లూ, కామేశ్వరీ కలసి అతనికేవోకొన్ని చికిత్సలు చేసేరు.

“తొందరపని మీద వెళ్ళి అరగంటలో వస్తాను. పేషెంటుకి వెంటనే ఏమీ ప్రమాదం లేదు. నీవు మళ్ళీ ఒకసారి టెంపరేచర్ తీసుకొని స్టిమ్యులెంట్సు యిస్తూవుండు” అని కామేశ్వరితో చెప్పి డాక్టరుగారు వెళ్ళిపోయారు.

సాయంత్రం ఆరయింది. ఆ పేషెంటును చూసిన దగ్గరనుంచీ కామేశ్వరికి ఏదోచాలా ఆందోళన కలిగింది. కేసుచాలా కఠినమైనదని ఆవిడకు తెలుసు. అంతకంటే సీరియస్ కేసులు వేలకొద్దీ ఆవిడ చూసింది. దక్కినవీ, దక్కనివీ కూడా వున్నాయి వాటిలో. అది హాస్పటల్ లో బహు సాధారణం. కాని ఆరోజు వరకూ తను చూసిన వేలకొద్దీ సీరియస్ కేసులు కూడా ఆవిడకు ఆందోళన కలుగ జేయలేదు. దానికి కారణం ఆవిడకు అగమ్యగోచరంగా ఉంది. మళ్ళీ టెంపరేచర్ చూసింది. పల్సు చాలా నీరసంగాఉంది. బ్రహ్మాండంగా వెలుగుతూన్న దీపంకాంతిలో ఆవిడ అతని ముఖందిక్కు ఒక్కసారి సూక్ష్మంగా చూసింది. కట్టులోంచి సగం కనిపిస్తూంది అతని ముఖంమీది కాలిన మచ్చ. కట్టుకొంచెం పైకి తప్పించి చూసింది. మచ్చని అంటిపెట్టుకొనే అడ్డంగా తిరిగి ఉండే లోతైన గీతకూడా కనిపించింది. ఆవిడగుండె ఒక్కసారి కొట్టుకుంది. ప్రక్కనుంచి ఎవరో వచ్చినట్టయింది. చూసేసరికి రైటరు. గోడనున్న కార్డు తీసి వ్రాస్తున్నాడు. పేరు చూసింది. ఆవిడ హృదయంతళుక్కుమంది. రైటరు వెళ్ళిపోయాడు. అటూయిటూ ఒకసారి చూసింది కామేశ్వరి. ఎవ్వరూ లేరు. సగది చిరిగిన చొక్కా మళ్ళించి చూసేసరికి అతని కుడిభుజంమీద ఎర్రటి పుట్టుమచ్చ కనిపించింది. గడియారం ఆవిడ గుండెలో ఏడుగంటలు కొట్టింది. అయిదుసంవత్సరాల తన కన్నీటి కథ మెరుపులా ఒక్కసారి మెరిసింది తన కళ్ళలో, హృదయంలోకూడా. వెయ్యిఆలోచనలు ఆవిడహృదయంలో తుఫానులు రేపేయి. అనురాగపూరితమైన మనస్సు, ఆవేశంతో కాలిపోతున్న హృదయం చాలా సేపు పెనుగులాడేయి. చివరికి మహాకష్టాలతో కరుడు కట్టిన ఆవిడ హృదయం ఒక్క లిప్త పాటులో మంచులా కరిగిపోయింది.

తన రెండు చేతుల్లో అతని చెయ్యితీసుకొని పల్సు చూస్తున్నది కామేశ్వరి. పల్సు చాలా నీరసమైపోతూంది. స్పృహ సరిగాలేదు. అప్రయత్నంగా స్రవించే బాష్పబిందువులతో ఆవిడ చెక్కిళ్లు తడిసిపోయేయి. ఒక్కసారి లేచి కళ్లు తుడుచుకొని, టేబిల్ మీది స్టిమ్యులెంటు కాస్త అతని నోట్లో పోసింది. మళ్ళీ మంచానికి దగ్గరబల్లతీసి కూర్చొని ఏదో ఆందోళనతో బాధతో అతని వేపే చూస్తున్నది కామేశ్వరి. ఆ పరిస్థితిలో, రెండునిమిషాల క్రితం వచ్చి తన పక్కనే నించున్న డాక్టరుగారిని ఆవిడ గమనించలేదు.

ప్లారెన్సు సతివలె ప్రమాద స్థితిలో ఉన్న రోగులందరికీ అవ్యాజమైన ప్రేమాభిమానములతోనూ జాలితోనూ సేవచేసి, ప్రాణంపోసే కామేశ్వరిలోని ఆందోళనను డాక్టరుగారు గుర్తించక పోలేదు. కాని ఆయన నిండుకుండ-తొణకరు! గంభీరంగా, ధైర్యంగా రోగిచెయ్యి తీసుకొని పల్సు చూసేరు. చాలా నీరసమైపోయింది. రోగి చెయ్యి లేస్తూంటే ఆచేత్తో కూడా లేచిన ఆవిడ నేత్రాలు డాక్టరుగారి ముఖాన్ని చూసి ఏదో ఒక చెప్పలేని బాధను వ్యక్తంచేసేయి.

“కామేశ్వరీ! ఈ నిర్భాగ్యుడు చాలా ప్రమాదమైన స్థితిలో ఉన్నాడు. గాఢమైన దెబ్బల మూలంగా శరీరంలోని నెత్తురు చాలా పోయింది.

యింక యింజక్షనులు ఏవీ ఉపయోగపడవు. పాపం!" అన్నారు డాక్టరుగారు.

"అయితే యింక సాధనం లేదా" అన్నట్టు చూసేయి ఆవిడ నేత్రాలు.

"ఈ నిర్భాగ్యుడు దిక్కూ మొక్కూ లేని వాడులా ఉన్నాడు. రక్త స్పర్శగల బంధువులు ఎవరైనా నెత్తురు యిస్తే తప్పకుండా జీవిస్తాడు. ఎవరున్నారు. ఎక్కడినుంచో యాంబులెన్సు తెచ్చి పడేసె యిక్కడ. యిటువంటి ఈ దిక్కుమాలిన వాడికి ఆ నెత్తురు ఎలా లభిస్తుంది" అన్నారు డాక్టరుగారు.

డాక్టరుగారు మాట్లాడుతూన్నంత సేపూ కామేశ్వరి అనిమిషత్వం వహించి, కందిపోయి కెంపుల్లావున్న తన నేత్రాలతో డాక్టరు గారి దిక్కు చూస్తూంది. తీవ్రమైన దృష్టిలోంచి ఆవిడ పైకి గుప్పుతూన్న భావాలు డాక్టరు గారికి అర్థం కాలేదు. చివరకు ఆయన అన్నారు.

"కామేశ్వరీ ఏమలా చూస్తున్నావు? నీ అభిప్రాయం నాకు చాలా అగమ్యగోచరంగా ఉంది. పాపం! ఇతను చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉన్న మాట నిజం. కాని ఈ విషయంలో మనం చెయ్యగలిగినదంతా చేసేం కదా-ఇంక మిగిలినది మనకు సాధ్యం కానిది. నీవు నేనూ యితనికి ఆప్తులం కాము. నెత్తురు దానం చెయ్యడానికి పనికిరాం. ప్రాణం పొయ్యలేం."

అంతవరకూ తుఫానులలో అల్లకల్లోలం అయిపోయిన ఆవిడ హృదయం ఒక్కసారి పొంగి పొర్లి పోయింది. చంద్రబింబాలవలె వెలిగి పోతూన్న కళ్లల్లోంచి జారే కన్నీటిని తుడుచుకుంటూ గద్గద స్వరంతో—

"ఇదుగో ఆయన ఆప్తబంధువు-కావలసినంత నెత్తురు తియ్యండి. ఇంకా ఏ మాలోచిస్తారు డాక్టరుగారూ?" అంటూ తన చేతి నందించింది కామేశ్వరి.

హిమప్రవాహంలాంటి ఆవిడ మాటలకు మంచులా గడ్డకట్టిపోయేరు డాక్టరుగారు. టార్చిలైటు కాంతిలో గోచరించిన దీనత్వం, పేము కుర్చీలో కూర్చొని ఉత్తరం అందించినప్పుడు గమనించిన బాధ డాక్టరు గారికి ఒక్కసారి జ్ఞప్తికి వచ్చాయి.

"పాపం! పిచ్చిపిల్ల-నెత్తురు దానమ్ యిచ్చి ప్రాణప్రతిష్ఠ చేస్తుందిట" అని తనలో అనుకుంటూ శిలా ప్రతిమలా నిల్చున్న కామేశ్వరి చెయ్యిపట్టుకున్నారు డాక్టరు, నెత్తురు తీయడానికి.

# మంత్రి వర్గీయుల ధోరణి: బాధ్యత

## బాచిన సుబ్బారావు

ఆంధ్ర ప్రదేశ కాంగ్రెసు అధ్యక్ష ఎన్నిక అనంతరం శ్రీ ప్రకాశం పంతులు ఆచార్య రంగా వారి సహచరులతో కాంగ్రెసునుండి వైదొలగి "ప్రజా పార్టీని" స్థాపించడాన్ని గురించి మంత్రివర్గంవారు చేయుచున్న ప్రకటనలు యథార్థమును కప్పిపుచ్చుటకే ఉద్దేశించబడినవి.

"ఓటమివలన కలిగిన ఉక్రోషముతో క్రొత్త పార్టీని స్థాపించినారు. ఎన్నిక జరుగువరకు కాంగ్రెసు మంచిదని చెప్పుచూ తమ ఓటమితో చెడిపోయినదంటున్నారు. ఓడిపోయినవారిని 9 మందిని కార్యవర్గంలోకి తీసికొంటామంటే నిరాకరించినారు. గుంటూరు జిల్లాలో పంచాయితీ ఎన్నికలు మరల జరిగితే మాకే మెజారిటీ వస్తుంది" ఇవీ మంత్రివర్గంవారి ప్రకటనల లోని ముఖ్య అంశములు.

పై విషయాలలోని సత్యాసత్యములను తెలిసికొనుటకు ముందు ఆంధ్ర దేశంలో కాంగ్రెసుకు నేడు పట్టిన దుర్గతికి కారణములను తెలిసికొనుట అవసరం. 1937 సంవత్సరంలో శ్రీ ప్రకాశం పంతులుగారు మంత్రియగువరకు ఆంధ్ర కాంగ్రెసుకు అధ్యక్షులుగా యుండి